

# అమెరి'కలకలం' కథలు

– వంగూరి చిట్టెన్ రాజు



## దొంగలు పడిన రెండు నెలల తరువాత...

"దొంగలు పడిన ఆరు నెలల తరువాత కుక్కలు మొరిగినట్టు " అనీ, "ఆలస్యం అమృతం విషం" అనే తెలుగు వాడు ఒక్క టీవీ సీరియల్స్ చూడడం తప్ప ఇంకే పనీ సరి అయిన సమయానికి చెయ్యనే చెయ్యడు. అదే ఆంగ్లేయులు "ఇటీజ్ నేవర్ లేట్ దేన్ నెవర్" అనుకుంటారు. నేను ఆంగ్ల భాష మాట్లాడే దేశంలో ఉన్న తెలుగు వాణ్ని కాబట్టి రెండు నెలల క్రితం ఆంగ్ల దేశంలో లో ఉన్న లండన్ లో జరిగిన సాహిత్య తతంగం గురించి ఆలస్యంగా "మొరుగుతున్నాను"....అనగా...అంతగా అవసరం లేని సంగతుల మీద ఇప్పుడు తెలుగులో వాపోతున్నానన మాట.

అసలు ఏం జరిగిందంటే రెండు నెలల క్రితం ఒక రోజు "ఎక్కడికెళ్తున్నావ్?" అంది మా క్వీన్ విక్టోరియా నేను సర్దుకున్న ఒక చిన్న పెట్టె, ఒక పెద్ద పెట్టె, "మంగలి పొది" అని ఆవిడచే ముద్దుగా పిలువబడే నా కంప్యూటర్ సంచీ చూసి. ఇక లాభం లేదు అనుకుని "లండన్ వెళ్తున్నాను, హనీ" అని రహస్యం బయట పెట్టేశాను. "ఓ లండనా...మరి చెంబు ఏదీ ? " అని పక, పకా నవ్వింది ఆ మహా తల్లి. నాకు వెలగ లేదు. "అదేనోయ్, వెర్రి హస్బెండూ...చిన్నప్పుడు లండన్ వెళ్ళడం అంటే చెంబు పట్టుకుని పెరట్లోకి పరిగెట్టడమేగా, ఇంతకీ అక్కడ ఏం ఉద్ధరించడానికేమిటీ?" అనేసి, నాలుగవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు లండన్ బయలు దేరిన నా పరువు గంగలో కలిపేసింది.

"అది సరే...ఆ చిన్న పెట్టెలో నీకున్న రెండు చెడ్డీలు, లుంగీలు సరిపోతాయి కానీ, అక్కడి చలికి వణికి చస్తావు. జాగ్రత్త " అనేసి...అదేమిటీ , అంత పెద్ద పెట్టెలో ఏం సర్దావు? నాలుగైదు ఉన్ని రగ్గులు కానీ పెట్టుకున్నావా? అని అడిగింది.

"ఓ అదా ? ఏం లేదులే...అందులో ఒక డజను పెద్ద పీటలు సర్దాను."" అన్నాను.

"పెద్ద పీటలా? యు మీన్ పీటలు....తెలుగు పీటలా, పీతలా ?" మొహం ఎలా పెట్టాలో తెలియని మొహం పెట్టింది మా ఆవిడ.

"అదేనోయ్...లండన్ లో తెలుగు సాహిత్యానికి, అక్కడి రచయితలకి పెద్ద పీట వేద్దామని వెళ్తున్నా కదా. లండన్ లో దొరకవేమో అని ఇక్కడి నుంచే పట్టుకెళ్తున్నాను". ఎలా ఉంది ఐడియా" అని ఆవిడని అనవసరంగా రెచ్చగొట్టాను. నేను అన్ని పెట్టెలూ పట్టుకుని హడావుడిగా ఇంట్లోంచి బయటకి వచ్చేసి ఇంకా ఆవిడ వ్యాఖ్యలు నా చెవుల్లో గింగురుమంటూ ఉన్నా నా కారు ఎయిర్ పోర్ట్ కి వెళ్లిపోయాను.

హీత్రో విమానాశ్రయం లో దిగగానే అక్కడ కస్టమ్స్ వాడూ "ఏం ఉద్ధరించడానికి ఇక్కడికి వచ్చావు? ఎన్నాళ్లుంటావు" ఆవటా అని సరిగ్గా అవే ప్రశ్నలు అడగగానే వీడు కొంపతీసి ఈ క్వీన్ ఎలిజబెత్ గారి బంటు గాడు మా క్వీన్ విక్టోరియా తో ముందే సంప్రదించాడేమో అని అనుమానం వచ్చేసింది. ఆ గండం నుంచి ఎంతో చాకచక్యంగా బయట పడి..అంటే కస్టమ్స్ నుంచి బయట పడగానే సాక్షాత్తూ లండన్ సంస్థ అధికారులు నన్ను స్వాగతించారు. చెప్పొద్దూ, నన్ను ఊళ్లో నుంచి సాగనంపడానికి సంతోషంగా చాలా మంది రావడం నాకు అలవాటే కానీ ఇలా నన్ను రిసీవ్ చేసుకోడానికి వాళ్ళు రావడం చూసి, వారి అమాయకత్వానికి జాలి వేసింది. పైగా అమెరికాలో లాగా యజమానీ & డ్రైవరూ, క్లీనరూ ఒకరే కాకుండా ఇక్కడ దర్జాగా వెనకాల సీటులో మేము కూచుండగా కారు డ్రైవరు నన్ను ఒక హోటల్ లాంటి ఎపార్ట్మెంట్ కాంప్లెక్స్ లాంటి బస

లో దించాడు. ఈ 4వ ప్రపంచ సాహితీ సదస్సుకు వచ్చిన గొప్ప వాళ్ళందరం అదే బసలో మూడు రోజులు కాపురం చేశాం. అనగా...."సిరివెన్నెల" సీతారామ శాస్త్రి, జొన్నవిత్తుల, తనికెళ్ళ భరణి, అశోక్ తేజ, అక్కిరాజు సుందర రామకృష్ణ, కొలకలూరి ఇనాక్, మండలి బుద్ధ ప్రసాద్ గారు, ఫ్రాన్స్ నుంచి వచ్చిన డేనియల్ నేజేర్స్, వడ్డేపల్లి కృష్ణ మొదలైన వారు అన్న మాట. ఇక ప్రధాన అతిథి అయిన ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి గారు, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ , సినీ నటులు సునీల్, రాజా రవీంద్ర, కేతవరపు రాజ్యశ్రీ మరికొందరు తెలిసిన వారి ఇళ్ళలో ఉన్నారు. ఈ "ప్రత్యేక" బస లో ప్రత్యేకత ఏమిటంటే, ప్రతీ గదిలోనూ కుంపటి, రిఫ్రిజిరేటర్, ఐదారు గదులకి కలిపి ఒక స్నానాల గది అన్నీ ఉంటాయి కానీ, మన బియ్యం, కూరలు, మంచి నీళ్ళు, కాఫీ, సబ్బు, తువ్వాళ్ళు వగైరా "సుఖ సంసారానికి " కావలసిన "సకల సరుకులు" మనమే ఏర్పాటు చేసుకోవాలి. స్థానిక సంస్థ వారు ఎంతో తెలివిగా సినీ ప్రముఖులకి మాత్రం పొద్దున్నే దోశలు, ఉప్మా చేసిపెట్టడానికి వలంటీర్లని ఏర్పాటు చేసి నా బోటి గాళ్ళని బ్రెడ్డు, జాములకి వదిలేశారు.

ఇక సభ విషయాల కొస్తే , సినీ ప్రముఖులు మేకప్ చేసుకుని రావడానికి ఆలస్యం అయిన కారణం చేత మొదటి రోజు యదావిధిగా గంటన్నర ఆలస్యంగా ప్రారంభం అయింది. అంతకు ముందే నేను కష్టపడి తయారు చేసిన "మినిట్ బై మినిట్" కార్యక్రమాన్ని ప్రధాన నిర్వాహకులు గారు "గంట బై గంట" గా మార్చేశారు. పైగా ఆయన ఎంత మంచి వారంటే , సభ జరుగుతుండగా ఎవరైనా వచ్చి "మా ఇంట్లో టామీకి ఒంట్లో బాలేదుట, ఇప్పుడే మా ఆవిడ ఫోన్ చేసింది" అని చెప్పగానే అప్పుడు అనర్గళంగా మాట్లాడుతున్న వక్త గారి నోరు కట్టేసి , మరో మూడు గంటల తరువాత మాట్లాడ వలసిన సదరు టామీ గారి ఉపన్యాసాన్ని పెట్టేసే వారు. ఇలా అనుకున్నదొకటీ, అయినదొకటీ గా సాహిత్య సభ గుబాళించింది.



ఇక ప్రారంభ సభ నిర్వాహకుడి గా నేను అందరినీ వేదిక మీదకి ఆహ్వానించాను. ముందుగా ప్రధాన అతిథిగా ఉప ముఖ్య మంత్రి గారిని సభని ప్రారంభించమని నేను మైకులో కోరుతుండగా...ఇందాకటి నిర్వాహకుడు గారు అర్జంటుగా వచ్చి నా చెవి గట్టిగా కొరికాడు. నా అనుభవంలో సరిగ్గా అటువంటి సమయంలో ఎవరైనా మైకు మూసేసి చెవి కొరికాడు అంటే ఎందుకూ పనికి రాని చెత్త విషయం అయినా అవాలి లేదా...ఎక్కడైనా కొంప మునిగి పోయి ఉండాలి. ప్రస్తుత చెవి కొరుకుడు విషయంలో ఈ రెండూ ఒకే సారి జరిగాయి. ఆ చెవి కొరుకుడులో మొదటి వాక్యం ఏమిటంటే ...అక్కడ హైదరాబాద్ లో మన అసెంబ్లీ స్పీకర్ గారు టీవీ ముందు కూచుని ఈ సభ లైవ్ కవరేజ్ చూస్తున్నారుట...అది తెలియగానే నేను ముందు వరసలో ఉన్న ఒకానొక టీవీ వారి కెమెరా చూసి ఆ కెమేరామన్ కేసి ఎంతో ఆప్యాయంగా చూసి కళ్ళతోటే పలకరించి అతన్ని ఇంప్రెస్ చేశాను. ఈ తతంగం జరుగుతుండగా రెండో వాక్యంలో తెలిసిన విషయం ఏమిటంటే సదరు స్పీకర్ గారి కుమార్తె తన తండ్రి ..అనగా సదరు స్పీకర్ గారి మీద అంగ్రేజీ లో వ్రాసిన పుస్తకం కాపీలు పది స్టేజి మీదనే ఉన్నాయి అనీ....వాటిని ఉప ముఖ్యమంత్రి గారు ఆవిష్కరిస్తూ ఉండగా చూసి ఆ ఆయన ..అనగా సదరు స్పీకర్ గారు చూసి తరించి, ఆనందించి అప్పుడు నిద్ర వస్తుంది కాబట్టి పడుకుంటారు కాబట్టి ఆ కార్యక్రమాన్ని తొందరగా పూర్తీ చెయ్యమని నాకు ఆ చెవి కొరుకుడులో వచ్చిన ఆదేశాలు. నాకు ఏ మాత్రం తెలియకుండా తెర వెనుక ఇంత భారీ ఎత్తున ఏర్పాట్లు చేసి ఆఖరి క్షణం లో నన్ను నిరాసక్తుడిగా

చేసిన ఆ సంస్థ వారి శక్తి కి అబ్బుర పడుతూ ఉండగా ఉప ముఖ్యమంత్రి గారు తన ఆరు పేజీల ఉపన్యాసాన్ని బాగానే చదివారు. ఆ పిమ్మట ఆ పుస్తకాన్ని అట్ట చిరగకుండా ఆవిష్కరించి, స్పీకర్ గారికి హాయిగా నిద్ర పోయే అవకాశం కలిగించారు.

ఇక లండన్ లో ఆ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు పెట్టడంలో ప్రధానోద్దేశ్యం అక్కడి రచయితలందరూ కలుసుకోడానికి, తమ రచనలు వినిపించడానికీ ఒక వేదిక కలిగించడం. కానీ "గుర్రాన్నైనా, గాడిదనైనా దాణా కలిపినా తొట్టె దగ్గరకి తీసుకెళ్ల గలం కానీ, తినిపించలేం కదా". ఈ పరిస్థితి కూడా అలాగే అయింది. ఉదాహరణకి ఒకావిడ తన ప్రతిభ గురించి నాలుగైదు ఈ మెయిల్స్ లో వివరించి తనకి కనీసం అరగంట సమయం అయినా కేటాయిస్తే తన ప్రతిభ అంతా ప్రపంచం మొత్తం తెలిసేలా చెప్పగలను" అని హడావుడి చేశారు. మేము ఆవిడకి కావాల్సిన



సమయం మొదటి రోజు కుదరక రెండో రోజు కేటాయించాం అని తెలియగానే ఆవిడకి అర్జంటుగా "తల నొప్పి" వచ్చి అసలు రానే లేదు. అదేమిటో ఆడవారికి పడక గదిలో తల నొప్పీ రావడం గురించి కథలు విన్నాను కానీ సాహిత్య సభలప్పుడు కూడా వస్తుంది అని లండన్ లో తెలుసుకున్నాను. కోపం వచ్చినప్పుడే తలనొప్పి రావడం కూడా మనం విన్నదే! ఇక మరొకాయన సభ జరిగే హాలు గుమ్మం దాకా వచ్చి, అక్కడ వాళ్ళు రిజిస్ట్రేషన్ ఫీజు అడగగానే ఖంగు తిని "నా అంతటి గొప్పవాడిని డబ్బు అడుగుతారా? హన్నా"?" అని కోప్పడి వెనక్కి వెళ్లిపోతుండగా నేను దూరంగా స్టేజి మీద నుంచి గమనించి, అర్జంటుగా నా జేబు లోంచి పాతిక పౌండ్లు తీసి గుమ్మం దగ్గరకి పంపించాను. అప్పటికీ ఆయన నిష్క్రమించారు...నా పాతిక పౌండ్లు హుష్ కాకీ. మొత్తానికి ఈ మహా సభలలో సినీ కవుల ప్రసంగాలు ఒక ఎత్తైతే, లండన్ లో తొలి సారిగా జరిగిన పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గారి అచ్చ తెనుగు అష్టావధానం మరొక ఎత్తు.

స్థానికుల కన్నా ఇండియా నుంచి వచ్చిన, రప్పించిన రచయితలే ఎక్కువగా ఉన్న రెండు రోజుల పాటు సాహిత్యం ఆనందంగా "భరించాక" ఇక లండన్ మహా నగరం చూసే ఏర్పాట్లు చేశారు నిర్వాహకులు. అందులో అందరికీ నచ్చినది హౌస్ ఆఫ్ లార్డ్స్ ....అనగా బ్రిటిష్ ప్రభుత్వం వారి పార్లమెంట్ భవనం లో లార్డ్ లుంబా గారు, హౌస్ ఆఫ్ కామన్స్ సభ్యులు డాన్ బైల్స్ గారితో సమావేశం. మనల్ని కొన్ని వందల ఏళ్ళు పరిపాలించిన బ్రిటిష్ వారి అధికారులతో మేం పదిహేను మందీ హౌస్ ఆఫ్ కామన్స్ లో ఏదో మామూలు టూరిస్ట్ లా కాకుండా ఒక మంచి మీటింగ్ లో కలుసుకోవడం, జొన్నవిత్తుల గారు ఆశువు గా తెలుగు కవిత్వాన్ని వినిపించడం, అక్కిరాజు గారు పౌరాణిక పద్యాలని పాడడం, నేను యదావిధిగా నా "సొంత సుత్తి" కొట్టుకోవడం భలేగా ఉంది. నేను "ఒద్దు మొర్రో" అని శుద్ధ తెలుగులో ఎంత వాపోయినా ముందు రోజు ఆం. ప్ర. ఉ.ము.మం. గారు, ఇప్పుడు లార్డ్ లుంబా గారు ...మరో పాతిక మందికి కూడా కప్పితే కప్పు కాక...పతకం ఇచ్చిన ఇచ్చు కాక...నాకు శాలువా కప్పి సత్కరించే సీనులలో నా అపరిమితానందాన్ని బాగానే నటించాను.

మొత్తానికి లండన్ తతంగం అంతా పూర్తి చేసుకుని మళ్ళీ హ్యూస్టన్ రాగానే నన్ను దింపుకుని ఇంటికి తీసుకెళ్ళడానికి వచ్చిన మా క్వీన్ విక్టోరియా నా "మంగలి పొదీ" ఆ పేద్ద పెట్టీ చూసి "ఏమిటీ , ఆ పెట్టెలో వాళ్ళు నీకు కప్పిన శాలువాలు, ఇచ్చిన చెక్క ముక్కలే" అని అందంగా



ఆశ్చర్యంగా మొహం పెట్టింది. నేను "ఆ నా మొహం, అవన్నీ నేను అక్కడ వేద్దామనుకున్న సాహిత్యం పీటలే! వేయించుకునే వాళ్ళు లేక మళ్ళీ వెనక్కి పట్టుకొచ్చేశాను. మన అమెరికాయే నయం." అని నా మొహం అదోలా, విచారంగా పెట్టాను.

ఏది ఏమైతేనేం, నిజంగానే లండన్ లో సెప్టెంబర్ (సెప్టెంబర్ 27-28, 2014) పాటు దిగ్విజయంగా జరిగిన నాలుగవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు విశేషాలు ఈ క్రింది లింకులలో చూడవచ్చును....ఆసక్తి ఉన్న వారు. ఆసక్తి లేని వారు ఆ విషయం నాకు చెప్తే కాని తెలియదు కాదు కాబట్టి చెప్పా పెట్టకుండా వదిలెయ్యండి.

**http://epaper.prajasakti.com/347810/Prajasakti-Main/Ap-Main-Edition?show=touch#page/8/1**

**http://www.cinevinodam.com/newsinner/1/377/world-telugu-litarary-meet-at-london.html**

**COMMENTS**